## ధరణితోనే భూములకు భద్రత



నర్సింహులపేట: సీఎం కేసీఆర్ తీసుకొచ్చిన ధరణితో భూములకు భద్రత పెరిగింది. కాంగ్రెస్ నాయకులు ధరణిని రద్దు చేసి పట్వారీ వ్యవస్థ తీసుకొస్తామని అంటున్నారు. దీంతో భూములకు రక్షణ ఉంటుందా? పట్వారీ విధానం అమలైతే రైతులకు భూమి మీద ఉన్న ధీమా పోతుంది. కాంగ్రెస్ నాయకులు తీసుకొస్తానన్న కౌలుదారు కాలమ్ భయపెడుతున్నది. దీంతో బీడు భూములుగా మారుతయ్. సాగు విస్తీర్ణం తగ్గి పనులు దొరక్కా మళ్ల కరువు వస్తది. భూముల ధరలు కూడా తగ్గుతాయి. కేసీఆర్ ప్రభుత్వంలో అందరూ సంతోషంగా ఉన్నారు. ఇంతకంటే మంచి సంక్షేమ పథకాలు ఎవరూ తీసుకురారు. గతంలో ఎవరైనా తెచ్చింండ్రా.. మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వం వస్తది.

*-జాటోత్ కిషన్ నాయక్, రైతు, హున్యతండా*

## కాంగ్రెస్ వస్తే రైతుల ఇళ్లకు తాళాలే..



దేవరుప్పుల, నవంబర్ 29 : తెలంగాణ వచ్చిన తరువాత రైతులు పట్నం వదిలి పల్లెలకు చేరారు. దశాబ్దాలుగా ఓరకు పెట్టిన నాగళ్లు సదిరి వ్యవసాయాన్ని సాదుమీదికి తెచ్చింండ్రు. గత కాంగ్రెస్ పాలనలో నీళ్లు లేక, కరెంటు లేక వ్యవసాయం పడావు పెట్టిన రైతు కుటుంబాలు పట్నంల కూలీనాలీ చేసి బతికింండ్రు. మళ్లీ అదే కాంగ్రెస్ పాలన వస్తే రైతుల వలసలు పక్కా, వారి ఇండ్లకు తాళాలు పడడం పక్కా. కాంగ్రెస్ నాయకుడు రేవంత్‌రెడ్డి నోటికి ఇష్టమొచ్చినట్టు మాట్లాడుతుండు. ఒకసారి రోజుకు 3గంటల కరెంటు సాలంటడు, ఇంకోసారి 10హెచ్‌పీ మోటర్లు రైతులు పెట్టాలంటడు. అడ్డగోలు మాట్లాడుతుతుండు. ఇది రైతులను నిండాముంచే వ్యవహారమే. తప్పిదారి కాంగ్రెస్ వస్తే ఆగంబతుకులే. రైతులు తమ ప్రతాపం గురువారం జరిగే ఓట్లల్ల సూయించాలె.

***- బిల్ల అంజమ్మ, మహిళా రైతు, కామారెడ్డిగూడెం, దేవరుప్పుల మండలం***






సమావేశంలో మాట్లాడుతున్న డీసీపీ సీతారాం

### ప్రశాంత ఎన్నికల నిర్వహణకు
# సర్వం సిద్ధం
### జనగామ డీసీపీ సీతారాం

పాలకుర్తి, నవంబర్ 29 : ఈనెల 30న(నేడు) నిర్వహించే అసెంబ్లీ ఎన్నికలను శాంతియుతంగా, ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని జనగామ డీసీపీ సీతారాం తెలిపారు. ఎన్నికల బందోబస్తు ఏర్పాట్లపై బుధవారం మండలకేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రత్యేక బలగాలకు దిశానిర్దేశం చేశామన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా పకడ్బందీ ప్రణాళికను రూపొందించి భద్రత చర్యలు చేపట్టినట్లు తెలిపారు. వర్ధన్నపేట ఎన్నికల నోడల్ ఆఫీసర్ రఘుచందర్, సీఐ పర్యవేక్షణలో 900మంది పోలీసు కేంద్ర సాయుధ బలగాలతో బందోబస్తు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల్లో ఎలాంటి అవాంచనీయ ఘటనలు జరుగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. 144సెక్షన్ అమల్లో ఉన్నందున ప్రజలు ఓటర్లు దానికి సహకరించి ఎన్నికల ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేయాలని సూచించారు. సమావేశంలో పాలకుర్తి కొడకండ్ల దేవరుప్పుల ఎస్సైలు సిబ్బంది పాల్గొన్నారు.

## అత్తాకోడళ్లవి మొసలికన్నీళ్లు
### ఎంపీపీ బస్వ సావిత్రి, జడ్పీటీసీ భార్గవీరెడ్డి

దేవరుప్పుల, నవంబర్ 29 : ఎలక్షన్ కమిషన్, ఎన్నికల నియమావళిపై కనీస అవగాహన లేని అత్తాకోడళ్లు మొసలి కన్నీరు కార్చి పాలకుర్తి ఓటర్లకు తప్పుడు సంకేతం ఇవ్వాలనే కుట్రను తిప్పి కొట్టాలని ఎంపీపీ బస్వ సావిత్రి పలుపునిచ్చారు. మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో జడ్పీ పల్లా భార్గవీరెడ్డితో కలిసి ఆమె మాట్లాడుతూ మంత్రి దయాకర్‌రావు తనకు అమెరికా పౌరసత్వం రాకుండా అడ్డుపడ్డారని కాంగ్రెస్ అభ్యర్థి అత్త ఝాన్సీరెడ్డి ఎన్నికల ప్రచారంలో ఓటర్లను తప్పుదోవ పట్టించినట్లు తెలిపారు. అంతటితో ఆగకుండా నేడు ఝాన్సీరెడ్డి, ఎలక్షన్ కమిషన్ ఆమెపై తీసుకున్న చర్యలను కూడా దయాకర్‌రావుపై ఆపాదించడం ఓట్లు దండుకోవడానికి ఆడిన నాటకమన్నారు. భారత పౌరసత్వం దరఖాస్తు చేసుకుంటే దేశ హోంశాఖ విచారణ జరిపి, అందులో వందశాతం నిజముంటే అంగీరిస్తుందన్నారు. అసత్యం ఉంటే తిరస్కరిస్తుందని తెలిపారు. ఝాన్సీరెడ్డి రెడ్‌క్రాస్ సేవల కోసం భారత దేశ పౌరసత్వం కావాలని, కోరిందని, తీరా విచారణలో ఆమె హోంశాఖకు తప్పుడు సమాచారం ఇచ్చిన నేపథ్యంలో ఆమె పౌరసత్వం దరఖాస్తును తిరస్కరించినట్లు తెలిపారు. ఈ విషయాన్ని కప్పిపుచ్చి ఝాన్సీరెడ్డి ప్రజలను తప్పుదోవ పట్టిస్తూ మంత్రి దయాకర్‌రావు తనకు పౌరసత్వం రాకుండా అడ్డుకున్నారని ఎన్నికల సభల్లో ప్రచారం చేశారన్నారు. ఎన్నికల ప్రచారం ముగిసిన తరువాత పాలకుర్తి నియోజకవర్గంలో ఓటు లేని వారు ఓ పార్టీ పక్షాన ప్రభావితం చేయొద్దనే నిబంధన ఎన్నికల నియమావళిలో ఉండగా, దాన్ని విస్మరించి ఝాన్సీరెడ్డి, భర్త రాజేందర్‌రెడ్డి తొర్రూరులోని తన ఇంట్లో కాంగ్రెస్ పక్షాన పలు కార్యక్రమాలు చేపట్టారని తెలిపారు. సమాచారం అందుకున్న ఎన్నికల అధికారులు వారిని నియోజకవర్గం వదిలిపోవాలని కోరినట్లు తెలిపారు. దీన్ని కూడా రాద్ధాంతం చేసిన ఝాన్సీరెడ్డి ఆమె కోడలు యశస్వినీరెడ్డి బోరున ఏడుస్తూ ఇదంతా దయాకర్‌రావు చేయిస్తున్నారని అనడం వారి అవివేకమవుతుందన్నారు. అమెరికా పౌరులు, మేధావులైన ఈ దంపతులకు ఎన్నికల నియమావళి తెలువదా అని వారు ప్రశ్నించారు. ఎలాగైనా దయన్నపై గెలవాలన్న వారి ఆకాంక్ష ఈ జన్మలో తీరనిదన్నారు. దయన్న భారీ మెజార్టీతో గెలువడం ఖాయమని, వారు అమెరికాకు పోవడం ఖాయమని వారన్నారు.



పాలకుర్తి : ఈవీఎంలతో పోలింగ్ కేంద్రాలకు తరులుతున్న సిబ్బంది

# ఎన్నికల ఏర్పాట్లు పూర్తి

- **ఈవీఎంలతో తరలిన సిబ్బంది**
- **పోలింగ్ కేంద్రాల్లో వసతులు కల్పించిన సిబ్బంది**
- **ఉదయం ఏడు గంటలకు పోలింగ్ ప్రారంభం.. 5గంటలకు పూర్తి**

పాలకుర్తి, నవంబర్ 29 : మండల కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల కళాశాలలో ఏర్పాటు చేసిన పంపిణీ కేంద్రం నుంచి బుధవారం సిబ్బంది పోలింగ్ కేంద్రాలకు తరలివెళ్లారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారి రోహిత్‌సింగ్ ఆధ్వర్యంలో పోలింగ్ సామగ్రిని తీసుకుని వారికి కేటాయించిన పోలింగ్ స్టేషన్‌లకు తరలివెళ్లారు. పాలకుర్తి నియోజకవర్గ పరిధిలో 294పోలింగ్ కేంద్రాలకుగాను 61పోలింగ్ కేంద్రాలను సమస్యాత్మకంగా గుర్తించారు. వెబ్ కాస్టింగ్147 పోలింగ్ కేంద్రాల్లో సీసీటీవీలు ఏర్పాటు చేశారు. 1,25,308 పురుషులు, 1,26,172 మహిళలు ఇతరులు 10మంది మొ త్తంగా ఓటర్లు 2,51,490 లక్షలు ఉన్నారు. 352మంది ఎన్నికల అధికారులు 4వందల మంది పోలీసులను 180సాయుధ బలగాలను ఏర్పాటు చేశారు. 7సెక్టార్లకు 36రూట్లను ఏర్పాటు చేశారు. 1408 మంది అధికారులను నియమించారు. ఎన్నికల విధుల్లో ఉండే మొత్తం సిబ్బంది 7సెక్టార్లలో విధులు నిర్వహించనున్నట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి తెలిపారు.

### దేవరుప్పులలో..

దేవరుప్పుల : నేటి అసెంబ్లీ ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తహసీల్దార్ హుస్సేన్ తెలిపారు. మండల వ్యాప్తంగా 40పోలింగ్ బూత్‌లు ఉండగా 11నుంచి 40, 63 నుంచి 73వరకు వరుస సంఖ్యలో ఉన్నాయన్నారు. పోలింగ్, పోలీసు సిబ్బందితో కలిపి 410మంది ఎన్నికల విధులు నిర్వహిస్తున్నట్టు ఆయన తెలిపారు. మండలంలో మొత్తం ఓట్లు 36,051 ఉండగా, అందులో పురుషులు 18,140 మంది, స్త్రీలు 17,911 మంది ఉన్నారని తెలిపారు. ఉదయం ఏడు గంటల నుంచి పోలింగ్ ప్రారంభమవుతుందన్నారు. ఎన్నికలు సజావుగా సాగేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆయన తెలిపారు. ఓటర్లు ఎన్నికల సిబ్బందికి సహకరించి, ప్రశాంత వాతావరణంలో జరిగేలా చూడాలని తహసీల్దార్ హుస్సేన్ తెలిపారు.

### పోలింగ్ కేంద్రాలకు చేరిన సిబ్బంది..

పెద్దవంగర, నవంబర్ 29 : తెలంగాణ రాష్ట్ర శాసన సభ ఎన్నికలకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. బుధవారం మండలంలోని 20గ్రామాలకు 31పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. ఇందుకు ముగ్గురు సెక్టోరియల్ అధికారులు, పోలింగ్ సిబ్బంది 130మందిని నియమించినట్లు అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, తహసీల్దార్ వీ మహేందర్ తెలిపారు. ఎన్నికల సిబ్బంది కేంద్రాలకు సామగ్రితో చేరినట్లు ఆయన తెలిపారు.

### పోలింగ్‌కు సర్వం సిద్ధం..

రాయపర్తి : ఎన్నికలకు మండలంలోని అన్ని గ్రామాల్లో సకల ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మండల ఎన్నికల అధికారి, తహసీల్దార్ ముల్కనూరి శ్రీనివాస్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ మండలంలోని 39గ్రామ పంచాయతీల పరిధిలో 52పోలింగ్ కేంద్రాలు ఉన్నట్లు తెలిపారు. ఓటర్లకు అవసరమైన తాగునీరు, విద్యుత్, షామియానాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 05 గంటల వరకు పోలింగ్ జరుగుతుందన్నారు. మండల ప్రజలు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాల్సిందిగా ఆయన కోరారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ ధరావత్ సూర్యానాయక్, గిర్ధావర్ కొయ్యడ చంద్రమోహన్ పాల్గొన్నారు.




దేవరుప్పల : మహిళా పోలింగ్ స్టేషన్ వద్ద ఎన్నికల సిబ్బంది



పెద్దవంగర పోలింగ్ కేంద్రానికి చేరుకున్న ఎన్నికల సిబ్బంది




రాయపర్తి పోలింగ్ కేంద్రానికి చేరిన పోలింగ్ సిబ్బంది

## అమ్మా..నాన్న.. ఇవ్వండి ఓటు హామీ
### తొర్రూరులో వినూత్న కార్యక్రమం

తొర్రూరు, నవంబర్ 29 : ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా గురువారం (నేడు) జరిగే ఎన్నికల్లో నిజాయితీగా ఓటు వేస్తామని ''అమ్మా..నాన్న...మీరు మాకు హామీ ఇవ్వండి'' అని తల్లిదండ్రులను పిల్లలు వేడుకుంటూ, వారి నుంచి సంతకంతో కూడిన హామీ పత్రాన్ని తీసుకునే వినూత్న కార్యక్రమాన్ని ఆరోగ్య మిత్ర స్వచ్ఛంద సంస్థ, సీనియర్ సిటిజన్స్ ఫోరం చేపట్టింది. బుధవారం తొర్రూరు డివిజన్ కేంద్రంలోని భీరన్ననగర్‌లో సామాజికవేత్త డాక్టర్ పరికిపండ్ల అశోక్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో చైల్డ్‌వెల్ఫేర్ కమిటీ చైర్‌పర్సన్ డాక్టర్ సుంకరనేని నాగవాణి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఓటు వేసి, అభివృద్ధి పథంలో ముందుకు తీసుకుపోగల నిజాయితీ గల నాయకున్ని ఎన్నుకోవాలన్నారు. చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు డాక్టర్ డేవిడ్, ఆరోగ్య మిత్ర స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి సహజ, కరున స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి కిషన్, సీనియర్ సిటిజన్ ఫోరం నాయకులు టీ యుగందర్, బాలల పరిరక్ష ణ అధికారులు వీరన్న, సోషల్ వర్కర్ వెంకన్న, చైల్డ్ లైన్ కో-ఆర్డినేటర్ వెంకటేశ్, ప్రభు పాల్గొన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు

## 216 లీటర్ల ఆవు పాలతో ఏకాదశ రుద్రాభిషేకం



పూజలు చేస్తున్న అర్చకుడు

పాలకుర్తి, నవంబర్ 29 : సోమేశ్వర లక్ష్మీనరసింహ స్వామి క్షీరగిరిక్షేత్రంలో బుధవారం రాత్రి ఆరుద్ర నక్షత్రమును పురస్కరించుకొని ఆరుద్రోత్సవ కార్యక్రమం అర్చకుల వేద మంత్రోచ్ఛారణల మధ్య మహా వైభవోపేతంగా నిర్వహించారు. సాయంత్రం నాలుగు గంటల నుంచి రాత్రి 7.30గంటల వరకు ఏకాదశ రుద్రాభిషేకం, ఆవు పాలు 216లీటర్లతో అభిషేకం గర్భాలయ దీపోత్సవం, పుష్పాలంకరణ, విశేష నీరాజనములు, మంత్రపుష్పము, తీర్థప్రసాద వితరణ వైభవంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తరించారు. శ్రీరామదాసు భజన మండలి ఆధ్వర్యంలో భజన బృందాలు భజన కార్యక్రమం నిర్వహించారు. అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.